
కలెక్టరేట్‌లో డీఆర్వోకు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్లు



టికెట్ల ఇక్కట్లు



వరంగల్ సిటీ, జనవరి 2: ముందస్తు బుకింగ్ చేసుకున్న టికెట్లను రద్దు చేస్తూ రైల్వేశాఖ సంబంధిత ప్రయాణికులకు సందేశాలు పంపిస్తుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇది అయ్యప్ప దీక్షలు కొనసాగే సమయం కావడంతో ఎంతో మంది అయ్యప్ప మాలధారులు, భక్తులు శబరిమల వెళ్లేందుకు బుకింగ్ చేసుకున్నారు. పలు రైళ్లు రద్దయిన కారణంగా రైల్వే అధికారులు తమ టికెట్లు రద్దయినట్టు మెసెజ్‌లు రావడంతో ఆందోళన చెందుతున్నారు. అకస్మాత్తుగా రద్దయితే శబరిమలకు ఎలా వెళ్లేదని వారు వాపోతున్నారు. అయ్యప్ప మండల దీక్ష పూర్తి చేసి శబరిమలలో దీక్ష విరమణ కోసం వెళ్లేందుకు టికెట్ బుకింగ్ చేసుకుంటేఇలా చేయడంపై అయోమయంలో పడ్డారు.

వరంగల్ జిల్లాలో సుమారు 5వేల మంది వరకు అయ్యప్ప మండల దీక్ష తీసుకున్నారు. వీరిలో సగానికి పైగా స్వాములు శబరిమల వెళ్లేందుకు మూడు, నాలుగు నెలల క్రితమే రిజర్వేషన్‌లో టికెట్లు బుక్ చేసుకున్నారు. సమయం దగ్గర పడుతుండటంతో స్వాములు శబరి యాత్రకు బయలు దేరేందుకు సిద్ధం అవుతుండగా వారికి హఠాత్తుగా రిజర్వేషన్ కేటాయించిన రైళ్లు రద్దు అవుతున్నందున టికెట్లు రద్దు చేసినట్లు అయ్యప్ప స్వాముల సెల్ ఫోన్లకు సంక్షిప్త సందేశాలు వస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియని మాలధారులు తలలుపట్టుకుంటున్నారు. రైల్వే అధికారులు చర్యలు తీసుకొని టికెట్లు రద్దు చేయకుండా ప్రత్యేకమైన రైళ్లలో ప్రయాణానికి ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

నాలుగు నెలల క్రితమే బుకింగ్...

డిసెంబరు నుంచి శబరిమల ఆలయంలో దర్శనాలు ప్రారంభం అవుతాయి. దీంతో దేశవ్యాప్తంగా మాలధారణ చేసిన అయ్యప్ప స్వాములు శబరిమల యాత్ర కోసం నాలుగు నెలల నుంచే టికెట్లు బుక్ చేసుకున్నారు. వరంగల్ జిల్లా నుంచి సుమారు 2వేల మందికి పైగా వివిధ ప్రాంతాల నుంచి రైల్వేలో శబరిమలకు వెళ్లేందుకు టికెట్లు రిజర్వేషన్ చేయించుకున్నారు. ఆగస్టు నుంచే రిజర్వేషన్ల పర్వం ప్రారంభమైనట్లు వారు చెబుతున్నారు. సెకండ్ క్లాస్ స్లీపర్ నుంచి ఏసీ, వన్‌టైర్, టూ టైర్ ఏసీల్లోనూ రిజర్వేషన్లు చేయించుకున్నట్లు వారు వాపోతున్నారు. జనరల్ రిజర్వేషన్లలో టికెట్లు లభించకపోయేసరికి ఏసీల్లో రిజర్వేషన్ చేయించుకున్నామని చెబుతున్నారు. ఎక్కాల్సిన స్టేషన్ నుంచి రిజర్వేషన్ దొరక్కపోవడంతో రైల్ ప్రారంభ ప్రాంతం నుంచి వేలాది రూపాయలు వెచ్చించి టికెట్లు బుక్ చేసుకున్నవారు ఉన్నారన్నారు.

టికెట్ క్యాన్సిల్ అంటూ సందేశాలు..

మండల దీక్ష పూర్తికావస్తున్న నేపథ్యంలో ఇప్పుడు టికెట్ క్యాన్సిల్ అయినట్లు వస్తున్న సంక్షిప్త సందేశాల టింగ్ టింగ్ చప్పుళ్లతో అయ్యప్ప స్వాములు ఆందోళన చెందుతున్నారు. వ్యయప్రయాసాలకోర్చి రిజర్వేషన్ టికెట్లు సంపాదిస్తే ఇప్పుడు రద్దు అవుతుండటం చాలా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రిజర్వేషన్ ఉంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుందని లేదంటే ఒడిదుడుకులు ఉంటాయని చెబుతున్నారు. ప్రయాణానికి అంతా సిద్ధం చేసుకుంటున్న వేళ టికెట్లు రద్దయినట్లు సంక్షిప్త సందేశాలు రావడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనివార్య కారణాలతో పలు రైళ్లు రద్దయిందని, దీంతో రిజర్వేషన్ క్యాన్సల్ అయ్యిందని, మీ డబ్బులు మీకు తిరిగి చెల్లించబడుతాయని సందేశాలు వస్తున్నాయని చెబుతున్నారు.

- రద్దవుతున్న శబరిమల రైళ్ల అడ్వాన్స్ బుకింగ్
- నెల రోజుల క్రితమే బుక్ చేసుకున్న భక్తులు
- రైళ్లు రద్దవడంతో క్యాన్సిల్ చేసినట్టు సందేశాలు
- అయోమయంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు
- టికెట్లు దొరక్కపోవడంతో ఆందోళన



రిజర్వేషన్ డబ్బులు ఎలా...

మూడు నెలల క్రితమే రైల్వే రిజర్వేషన్ చేయించుకున్న వారి టికెట్లు రద్దు అవుతున్న సంక్షిప్త సమాచారాలు వారి సెల్ ఫోన్లకు వస్తున్నప్పటికీ డబ్బులు మాత్రం వారిలో చాలా మందికి నేరుగా వచ్చే అవకాశం లేదు. చాలా మంది ప్రైవేటు ట్రావెల్స్, ట్రావెల్స్ కన్సల్టెన్సీల్లో రిజర్వేషన్లు చేయించుకున్నారు. అందుకు ఆయా సంస్థల యజమానుల ఖాతాల్లో నుంచే డబ్బులు ఆన్‌లైన్‌లో చెల్లించి టికెట్లు బుక్ చేసుకున్నారు. ఇప్పుడు టికెట్ రద్దయిన వారి డబ్బులు కన్సల్టెన్సీల ఖాతాల్లోనే జమవుతున్నాయి. దీంతో టికెట్లు బుక్ చేసుకున్న వారికి నేరుగా డబ్బులు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

రద్దయిన రైళ్లు ఇవే..

వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా శబరిమల వెళ్లే వివిధ రప్తిసాగర్, మిలీనియమ్, స్వర్ణ జయంతి, బిలాస్‌పూర్ తదితర రైళ్లు అనివార్య కారణాలతో రద్దయినట్లు రైల్వే శాఖ ప్రకటించింది. వాటిల్లో సీట్లు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల టికెట్లు రద్దయినట్లు ఇప్పటికే సంక్షిప్త సందేశాలు జారీఅయ్యాయి.

వాతావరణ మార్పులే కారణమా?

ఉత్తరాది నుంచి ప్రారంభం కానున్న రైళ్ల రద్దు అవుతున్నాయి. అయితే చలికాలంలో అక్కడుండే అసాధారణ పరిస్థితుల కారణంగానే రైళ్లు రద్దు అవుతున్నట్లు కొంత మంది రైల్వే అధికారులు చెబుతున్నారు. అయితే ప్రతీ ఏడాది ఇదే సమయంలో శబరిమలకు వెళ్లేందుకు అనేక రైళ్లు, స్పెషల్ రైళ్లు ఉండేవని, ఈ ఏడాది మాత్రం ఉన్న రైళ్లను రద్దు చేయడం ఏంటని అయ్యప్ప స్వాములు ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక కారణాలను చూపిస్తూ రైల్వే శాఖ అయ్యప్ప స్వాములను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక రైళ్ల ద్వారా శబరిమలకు చేర్చాలి..



సంగెపు రవికిరణ్, కాశిబుగ్గ

మూడు నెలల కిందనే టికెట్లు బుక్ చేసుకున్నాము. ఇప్పుడేమో రైళ్లు రద్దయిన కారణంగా టికెట్లు రద్దయినట్లు మెసెజ్‌లు వస్తున్నాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. శబరి ఎలా అయినా వెళ్లాలి. టికెట్లు రద్దు చేయకుండా ప్రత్యేక రైళ్లలో అయ్యప్ప స్వాములను శబరిమలకు చేర్చాలి.

ఇతర రైళ్లలో టికెట్లు కేటాయించాలి...



కావటి కరుణాకర్, రంగశాయిపేట

అకస్మాత్తుగా టికెట్లు క్యాన్సిల్ అయినట్లు సెల్ ఫోన్‌కు మెసెజ్‌లు వస్తున్నాయి. టికెట్లు క్యాన్సిల్ చేయకుండా ఇతర రైళ్లలో రిజర్వేషన్ కల్పించాలి. రెండు, మూడు నెలల క్రితం టికెట్లు రిజర్వేషన్ చేయించు కున్నాము. మరో రెండు, మూడు రోజుల్లో ప్రయాణం చేయాల్సి ఉండగా ఇప్పుడు టికెట్లు క్యాన్సిల్ అయ్యాయి. ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదు.

చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

- డీఆర్వోకు తీర్మాన ప్రతిని అందజేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- నర్సంపేట మునిసిపాలిటీలో సర్వత్రా చర్చ

నర్సంపేట, జనవరి 2 : నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటిరజనిపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో వాసుచంద్రకు వారు అవిశ్వాస తీర్మాన ప్రతిని అందజేశారు. మునిసిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉండగా ఇందులో 18వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 6 వార్డుల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 18 మందిలో 17 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెడుతున్నట్లు వెల్లడించారు. మునిసిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు విశ్వాసం కోల్పోవడం జరిగిందని, అందుకే అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదించడం జరిగిందని 7వ వార్డు కౌన్సిలర్ మినుముల రాజు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వోకు అందజేసిన అవిశ్వాస తీర్మానంలో పేర్కొన్నారు. తనతోపాటు 1వ, వార్డు నుంచి 13వ వార్డు కౌన్సిలర్లు, 16, 17, 23, 24వ వార్డుల కౌన్సిలర్లు మొత్తం 17 మంది అవిశ్వాస తీర్మానానికి అంగీకరించారంటూ 12 మంది కౌన్సిలర్లు అధికారికి తీర్మానాన్ని అందజేశారు. తీర్మాన ప్రతిని అధికారికి అందించే సందర్భంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు దార్ల రమాదేవి, ఎమ్డీ మహబూబ్‌పాషా, రుద్రమల్లీశ్వరి, రాయిడికీర్తిరెడ్డి పాల్గొనలేదు.

గతంలోనూ తీర్మానానికి యత్నం

గతంలోనూ మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి కౌన్సిలర్లు ప్రయత్నించారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు హైదరాబాద్ క్యాంప్‌కు కూడా వెళ్లారు. అవిశ్వాస తీర్మానానికి జనవరి 27 వరకు అవకాశం లేదని తెలిసి వారు నర్సంపేటకు తిరిగివచ్చారు. ఈనెల 27తో నాలుగేళ్ల పాలన ముగియనుండడంతో అవిశ్వాస తీర్మానం పెట్టడానికి మరోమారు యత్నించారు. అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేసిన వారిలో కౌన్సిలర్లు మినుములరాజు, శీలం రాంబాబు, బోడ గోల్యానాయక్, జుర్రురాజు, దేవోజుతిరుమల, నూనావత్ కవిత, నాగిశెట్టి పద్మ, బానాల ఇందిర, వేల్పుగొండ పద్మ, రామసహాయం శ్రీదేవి, గంది రజిత, గంపసునీత ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు తెలిసే అవిశ్వాసం పెడుతున్నారా?

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి తెలిసే మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనిపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెడుతున్నారా? అన్న విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కొంత కాలంగా చైర్‌పర్సన్‌పై అసంతృప్తితో ఉన్న కొంతమంది కౌన్సిలర్లు కొద్ది నెలల క్రితం క్యాంప్‌కు వెళ్లిన విషయం ఆయన దృష్టికి వచ్చింది. అప్పుడు అవిశ్వాసం తీర్మానానికి అవకాశాలు లేక పోవడంతో వారు తిరిగొచ్చి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు రావడం రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడం స్థానికంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి కూడా ఓటమిపాలయ్యారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యేను కొందరు కౌన్సిలర్లు కలిసి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన వారితో వద్దని సూచించినట్లు సమాచారం. ఆయన సూచించి కొద్ది రోజులు గడువక ముందే మంగళవారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ తీర్మానాన్ని మాజీ ఎమ్మెల్యేకు చెప్పి చేశారా? లేక వారే నిర్ణయం తీసుకుని చేశారా? అన్న చర్చ నియోజక వర్గంలో జోరుగా సాగుతోంది.


ఎల్లంబజార్‌లోని కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

- నగరంలోని రెండు డివిజన్లలో ఆకస్మిక తనిఖీ
- ఇప్పటి వరకు లక్షకు పైగా దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 2: ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. మంగళవారం నగరంలోని 24వ డివిజన్ ఎల్లంబజార్ కమ్యూనిటీహాల్, 25వ డివిజన్ చార్‌బౌళి వాటర్ ట్యాంక్ అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 44బృందాల ద్వారా అభయ హస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తులను డిసెంబరు 28 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, ఇప్పటివరకు లక్షకు పైగా వచ్చాయని పేర్కొన్నారు. దరఖాస్తు అందజేసే క్రమంలో యజమాని ఆధార్‌కార్డు, రేషన్ కార్డు పత్రాలు జమ చేయాలని, రేషన్‌కార్డు లేని వారు ఆధార్ జిరాక్స్ పత్రం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్వీకరణ కేంద్రాల్లో మహిళలు, పీడబ్ల్యూడీ వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లతోపాటు సాధారణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తేజస్వీని రామ, బస్వరాజు శిరీష, ఆర్‌డీవో వాసుచంద్ర, డిప్యూటీ కమిషనర్ క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో రద్దీ

వరంగల్‌సిటీ, జనవరి 2: దేశవ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లు సమ్మె చేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల రద్దీ పెరిగింది. అయితే ట్రక్కు డ్రైవర్లు సమ్మె విరమించినట్లు ప్రకటించినా ప్రజలకు ఆ విషయం తెలియక పెట్రోలు, డీజిల్ కోసం ఎగబడ్డారు. పెట్రోల్ పంపుల్లో వాహనదారులు పెద్దసంఖ్యలో బారులు దీరారు. రద్దీ కారణంగా పలు బంకుల్లో పెట్రోల్, డీజిల్ ఐపోవడంతో నో స్టాక్ బోర్డులు పెట్టారు. అయితే పౌరసరఫరాల అధికారులు మాత్రం పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని, విక్రయాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయని చెబుతున్నారు.

పెట్రోల్ బంకులు పనిచేస్తామని ట్రక్కు డ్రైవర్ల సమ్మె విరమణతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.


హంటర్‌రోడ్‌లోని పెట్రోల్‌బంకులో రద్దీ

సదరం కోసం దరఖాస్తు చేసుకోవాలి

వరంగల్ సిటీ, జనవరి 2: వరంగల్ జిల్లా పరిధిలో జనవరి మాసానికి గాను అర్హులైన వారు సదరం క్యాంపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఆర్‌డీఏ పీడీ ఎం.సంపత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మీసేవా కేంద్రాల్లో సదరం స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 9న మానసిక వికలాంగుల విభాగానికి, 12న మూగ, చెవిటికి సంబంధించి, 23, 24, 25 తేదీల్లో ఆర్థో విభాగానికి సంబంధించిన వారికి, 29, 30 తేదీల్లో సదరం కంటికి సంబంధించి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షకు వరంగల్ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో, మిగతా వాటికి ఎంజీఎం ఆస్పత్రిలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటి), జనవరి 2 : బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంగళవారం ఈ మేరకు కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరిపినట్లు సమాచారం. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. కొద్ది రోజులుగా బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రెండు పార్టీలకు చెందిన కార్పొరేటర్లకు కాంగ్రెస్ నేతలు కూడా వల వేసినట్లు సమాచారం. బల్దియాలోకాంగ్రెస్‌కు నలుగురు కార్పొరేటర్లు ఉన్నారు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అనధికారికంగా కాంగ్రెస్ గూటికి చేరారు. కొత్తగా చేరనున్న కార్పొరేటర్లతో కాంగ్రెస్ బలం 11దాటనున్నట్లు తెలిసింది. వీరికి తోడు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి బల్దియా ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉండనున్నారు. ఈ క్రమంలో బల్దియాలో కాంగ్రెస్ బలం మరింత పెరుగనుంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో వీరు కాంగ్రెస్‌లో చేరనున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, రాజు, నెక్కొండ కిషన్‌తోపాటు మరికొందరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది. వీరితోపాటు మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్‌లు కుడా కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు సమాచారం.



ఐనవోలు జాతర ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

ఐనవోలు, జనవరి 2: ఐనవోలు జాతర ఏర్పాట్లను దేవదాయధర్మదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆలయానికి వచ్చిన కమిషనర్ అధికారులతో సమావేశమై జాతర ఏర్పాట్లను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావును అడిగి తెలుసుకున్నారు. జాతరలో ఎలాంటి లోటు పాట్లు జరుగకుండా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అంతకు ముందు కమిషనర్ స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. సునీత, అధికారులు సంజీవరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న కమిషనర్ అనిల్‌కుమార్

జాతర పార్కింగ్.. క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర పార్కింగ్ క్యూలైన్ల ఏర్పాట్లను ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మామునూరు ఏసీపీ సతీష్, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌లతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయానికి వచ్చే నాలుగుదారులకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలతోపాటు క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలని తెలిపారు.

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

▸▸ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నయీంనగర్, జనవరి 2: అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో మంగళవారం వివిధ శాఖల డైరెక్టర్లు, ఐన్‌టియూసీ-327 యూనియన్ నాయకులు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా పరిపుష్టిగా కంపెనీ ఉండాలంటే అందరూ కలిసికట్టుగా పని చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. వినియోగదారులను గౌరవించడం వారి సమస్యలను పరిష్కరించడం ఏటి అండ్ సి నష్టాలను తగ్గించాలని ఆయన కోరారు. విద్యుత్ భద్రతా సూచనలు ఉద్యోగస్తులు, వినియోగదారులు విధిగా పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, ఐన్‌టియూఈ-327 యూనియన్ నాయకులు మహేందర్‌రెడ్డి, బుచ్చయ్యగౌడ్, నీలారావు శ్రీనివాస్, ఓదేలు, సోమయ్య, సీజీయంలు, జీయంలు పాల్గొన్నారు.


సీఎండీ వరుణ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు

అభివృద్ధి పనులు ముందుకు సాగేనా, ఆగేనా?

హడావుడి ప్రారంభాలు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదరించేనా..

- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కేటాయింపు కాని డబుల్ ఇళ్లు, పూర్తికాని రహదారులు

తొర్రూరు రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 2 : పాలకుర్తి నియోజకవర్గానికి కేంద్రంగా ఉంటూ అన్నిరంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరు మండలం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి ఎస్.సుధాకర్ రావు, దుగ్యాల శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా కొనసాగినా స్వరాష్ట్రంలో 2014, 2018 సంవత్సరంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కొనసాగుతూ కొంతమేర అభివృద్ధి చేసినప్పటికీ ఆశించిన మేరకు కాలేదు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో తొర్రూరు మండలంలో కోట్లాది రూపాయల పనులకు హడాహుడిగా శంకుస్థాపనలు చేసి, ఎర్రబెల్లి ఓడిపోయారు. శంకుస్థాపన పనులు జరిగిన అభివృద్ధి పనులు ముందుగు సాగేనా, నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తొర్రూరు మిని ట్యాంకు బండ్, విద్యావైద్యం, బెడ్రూం ఇళ్లు, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరముంది.



తొర్రూరు మండలం గోపాలగిరిలో ఆయిల్ పామ్ పరిశ్రమ జరిగే స్థలం, శిలాఫలకం (ఫైల్)

మినీట్యాంకు బండ్, ఆయిల్‌పామ్ పరిశ్రమ పూర్తి అయ్యేనా..?

తొర్రూరు పెద్దచెరువును మినీట్యాంకు బండ్ చేస్తామంటూ 2017-18 సంవత్సరంలో గత ప్రభుత్వం రూ.3 కోట్ల 60 లక్షల నిధులను మంజూరు చేసింది. బండ్ పనులకు హడావుడిగా టెండర్లు పిలిచారు. దీంతో రూ.2 కోట్ల 19 లక్షలతో కాంట్రాక్టర్లు కట్ట మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణం కోసం పిల్లర్లు, పూడికతీత వంటి పనులు చేసి వదిలేశారు. మొత్తంగా బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పూర్తిస్థాయిలో ట్యాంక్ బండ్ నిర్మాణం కావాలంటే అధిక నిధులు కావాల్సి ఉంటుందంటూ అందుకనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరువ చూపి త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూనెగింజల ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా ఆయిల్‌ఫాం పంట సాగుకు సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. అందులో భాగంగానే పంటను విక్రయించుకోవడానికి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో 111 సర్వేనెంబర్‌లో సుమారు 85 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించారు. అందులో 45 ఎకరాల్లో రూ.175 కోట్ల నిధులతో అత్యాధునికమైన పరిశ్రమను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు సెప్టెంబరు 2023న ప్రారంభించారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో వెయ్యికి పైగా రైతులు 4,769 ఎకరాలలో పామాయిల్ సాగు కొనసాగతుండగా, 2023-24కుగాను 8 వేల ఎకరాల పంట సాగు చేయడానికి లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే ఏడాది కొంత పంట చేతికి వచ్చే సమయానికి పరిశ్రమను అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్‌ఫాం రైతులు కోరుతున్నారు.

ఇళ్ల కేటాయింపు చేయాలి

తొర్రూరు మండలంలోని పేద ప్రజల సంక్షేమానికి ఇళ్లు లేనిపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పడంతో కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించినా కేటాయింపులు చేయలేదు. గృహలక్ష్మీ పథకం కింద రూ.5లక్షలు ఇస్తామనడంతో సుమారు 3,418 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని సుమారు 900 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, 200 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అయితే కర్కాల, కంఠాయపాలెం, గుర్తూర్, మాటేడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయినా లబ్ధిదారుల ఎంపిక చేకపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి. గుర్తూర్ గ్రామంలో 40 ఇళ్లకు గాను 20, కర్కాల గ్రామంలో 20 ఇళ్లు పూర్తైనా లబ్ధిదారుల కేటాయింపు చేయకపోవడంతో ప్రజలు వెళ్లి ఉంటున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా తొర్రూరు మండలంలోని కర్కాల గ్రామంలో పాలేరు వాగు పై బ్రిడ్జి, గుర్తూర్ -ఎర్రబెల్లి గూడెం గ్రామాల మధ్య ఆకేరు వాగు పై నిర్మించే బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. అయితే గుర్తూర్‌లో నిర్మించే బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్ల 64 లక్షలకు టెండర్లు పిలిచి ఓపెన్ చేయలేదు. గుర్తూర్ గ్రామం నుంచి మడిపల్లి, ఫత్తేపురం, తొర్రూరు వచ్చే రహదారి నిర్మాణం పనులు ప్రారంభించి వదిలేశారు. గోపాలగిరి, చెర్లపాలెం మధ్య రహదారి, చింతలపల్లి, కొమ్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారి, మున్సిపాలిటీలో పలు కాలనీల్లో కంకరపోసి వదిలేశారు. మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మినీట్యాంకు బండ్ కోసం ఫిల్లర్ల నిర్మాణంకే పరిమితమైన తొర్రూరు పెద్ద చెరువు



తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో పూర్తి అయిన డబుల్‌బెడ్రూం ఇళ్లు

వంద పడకల ఆస్పత్రి కోసం ఎదురుచూపులు..

తొర్రూరు మండలంలో గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్తామామలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, రాజేందర్ రెడ్డి దంపతులు సొంత ఖర్చులతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రి మాత్రమే ఉంది. రోగుల తాకిడితో ఆస్పత్రి భవనం సరిపోకపోవడంతో వంద పడకల ఆస్పత్రి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసి తొర్రూరు, మరిపెడ మండలాలకు సంబంధించి వంద పడకల ఆస్పత్రిని మరిపెడ మండల కేంద్రంలో అప్పటి వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. వంద పడకల ఆస్పత్రికి సుమారు 3 ఎకరాల స్థలం అవసరం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో స్థల సేకరణ చేయాల్సి ఉంది. అప్‌గ్రేడ్ అయినా ఆ స్థాయిలో వైద్యపరీక్షలు మాత్రం అందకపోగా, కనీసం ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఎంబీబీఎస్ వైద్యులు నామమాత్రంగా చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతా ప్రజలు ప్రత్యేక వైద్యనిపుణుల కోసం వరంగల్, ఖమ్మంతో పాటు ప్రసవాలకు వర్ధన్నపేట, వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి వెళ్తున్నారు. అదేవిధంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల నుంచి డిగ్రీ విద్యను పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించడానికి పీజీ, బీఈడీ, ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడంతో వరంగల్, హైదరాబాద్, ఖమ్మం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించే ఆర్థిక పరిస్థితి లేని పేద విద్యార్థులు మధ్యలో చదువులు మానేస్తున్నారు. ఇప్పటికైనా విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టిసారించాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

ఉచిత ప్రయాణంతో అద్దె బస్సులకు డీజిల్ భారం

హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షుడు రాంరెడ్డి

ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేత



ఆర్‌ఎం శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ నాయకులు

సుబేదారి, జనవరి 2: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో అద్దె బస్సులకు డీజిల్ భారం పెరిగిందని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ రీజినల్ అధ్యక్షులు మారిపెల్లి రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ రీజియన్ కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హైర్ బస్సు ఓనర్స్ వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె. శ్రీలతకు అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకానికి ముందు బస్సులలో 45 నుండి 60 మంది వరకు ప్రయాణికులు ప్రయాణించేవారని, ఇప్పుడు ఉచిత బస్సు పథకంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగి బస్సుల టైర్లపై భారం పడుతుందన్నారు. అలాగే బస్సుల కమాన్ పట్టీలు విరుగుతున్నాయని, బస్సు మెయింటెనెన్స్ విపరీతంగా పెరుగుతుందన్నారు. ఓవర్‌లోడ్ కారణంగా కేఎంపీఎల్ బాగా తగ్గిపోయిందని, దీనివల్ల 4.5 కేఎంపీఎల్ ఇవ్వాలన్నారు. జనవరి 5వ తేదీలోగా మా సమస్యలు పరిష్కరించాలని, లేదంటే 5 నుంచి సమ్మె చేస్తామని ఆర్‌ఎంకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు రాంరెడ్డి, తెలిపారు. ఆర్‌ఎంకు వినతిపత్రం అందజేసినవారిలో హైర్ బస్సు ఓనర్స్ రాష్ట నాయకులు లక్కం ప్రభాకర్, కె. సదానందం, వెంకటేశ్వర్లు, పి. కుమార్, వి. వెంకట్‌రెడ్డిలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- మృతురాలి బంధువుల ఆందోళన
- ధర్మారంలో ఉద్రిక్తత



లక్ష్మీ (ఫైల్)



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లక్ష్మీ బంధువులు

పరకాల, జనవరి 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నడికూడ మండలం ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన నక్క లక్ష్మి (40), ఎర్రన్న దంపతులకు 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భర్తతో గొడవపడి లక్ష్మి ఐదేళ్లుగా వేరే ఇంట్లో కిరాయికి ఉంటోంది. డిసెంబరు 28న రేషన్ కార్డు విషయమై తన భర్త ఎర్రన్న ఇంటికి వెళ్లి మాట్లాడి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోని బొడ్రాయి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. బంధువులు, స్థానికులు గమనించి వెంటనే 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి చికిత్స పొందుతూ జనవరి 1 (సోమవారం) మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం లక్ష్మీ మృతదేహాన్ని తన భర్త ఎర్రన్న ఇంటి ముందు వేసి బంధువులు రహదారిపై ధర్నా చేశారు. కొన్నేళ్లుగా ఎర్రన్న లక్ష్మీని పట్టించుకోలేదని, ఎర్రన్న ఆస్థిని లక్ష్మీ కూతురు పేరు మీద రాయాలని ఆందోళన చేశారు. ఎర్రన్న లక్ష్మీని ఇబ్బందులకు గురిచేసి కూతురు ఉన్నా వేరే పెళ్లి చే సుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదించారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్సై లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువుల ను సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా లక్ష్మీ బంధువులు వినకపోవడంతో పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. మహిళలను పక్కకు నెట్టివేయడంతో గ్రామ సర్పంచ్ గోల్కొండ ఉమ, ఆమె భర్త సదానందం సీఐతో వాగ్వాదానికి దిగారు. మహిళలను నెట్టివేయడం సరికాదన్నారు. చివరకు పరారీలో ఉన్న లక్ష్మీ భర్త ఎర్రన్నను తీసుకువస్తామని సీఐ హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రజాసమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ లక్ష్యం

- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



నందనం గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జనవరి 2: ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ ఫలాలను అర్హులందరికి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా మంగళవారం నందనంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఐదు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఇవ్వని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మరిన్ని రోజుల గడువు ఇవ్వడానికి కృషిచేస్తుందన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డి, సర్పంచ్ యాకర మంజులయాదగిరి, ఎంపీటీసీ జెట్టబోయిన లక్ష్మి, ఉప సర్పంచ్ మౌనికరాము, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులు పెన్నులు, పెన్సిళ్ల ఎమ్మెల్యేకు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు బండి సంపత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలలోని సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలోని గుంతలను పరిశీలించిన ఎమ్మెల్యే ముందుగా వాటిని పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అడిషినల్ కలెక్టర్ మహేందర్‌జీకి సూచించగా పాఠశాలలను సందర్శించి నివేదికను అందజేస్తామని తెలిపారు. నందనంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఫ్లెక్సీల వివాదం తలెత్తి ఫ్లెక్సీలను చింపి తొలగించారు. ఎమ్మెల్యే తొలి సారి ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామానికి వస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఎన్నికల ముందు పార్టీలో చేరినవారితోపాటు స్థానికంగా ఉండని వారు ఫ్లెక్సీల్లో తమ ఫొటోలను పెద్దవిగా ముద్రించుకొని సీనియర్ల ఫోటోలు పెట్టలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఫ్లెక్సీల వివాదానికి తెరతీసి చింపివేశారు. ఎమ్మెల్యే వస్తే పరువుపోతుందని గ్రామ పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను మొత్తం తొలగించి వివాదానికి తెరదించారు.

కారు ఢీకొని బాలుడి మృతి

- మహబూబాబాద్ జిల్లా ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఘటన



విజయ్‌ప్రకాష్ (ఫైల్)

మహబూబాబాద్‌రూరల్, జనవరి 2 : కారు ఢీకొన్న ఘటనలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు మండలం మచ్చర్లకు చెందిన చింతల వినోద-సుధాకర్ దంపతులు హైదరాబాద్‌కు వలస పోయి కూలీనాలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు విజయ్‌ప్రకాష్ (8) ఆదే గ్రామంలోని అమ్మమ్మ ఈసం నర్సమ్మ వద్ద ఉంటూ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. సోమవారం రాత్రి మహబూబాబాద్‌కు చేరుకున్న కుటుంబసభ్యులు రాత్రి కావడంతో ముత్యాలమ్మగూడెంలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తర్వాత మంగళవారం మధ్యాహ్నం మచ్చర్లకు వెళ్లేందుకు ముత్యాలమ్మగూడెం స్టేజీ వద్ద ఆటో ఎక్కుతున్న క్రమంలో చెన్నారావుపేట నుంచి కురవికి వెళ్తున్న కారు ఆటోకు కుడివైపున ఉన్న బాలుడు విజయ్‌ప్రకాష్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమ కళ్లముందే కుమారుడు మృతి చెందడంతో వారు ఒక్కసారిగా షాక్ గురయ్యారు. కొద్దిసేపట్లో స్వగృహానికి వెళ్లాల్సిన బాలుడు అనంతలోకాలకు వెళ్లడంతో కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల షురూ



కురవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 2 : జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 104, కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాలు 15, మోడల్ స్కూల్స్ 8 వెరసీ 127 పాఠశాలలుండగా వాటిల్లో 4405 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో బాలురు 2296, బాలికలు 2109 మంది మార్చి 18న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్న వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నిర్ణయించిన కాల నిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజు ఉదయం 8 :30 నుంచి 9:30 వరకు, సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున తరగతులు నిర్వహిస్తూ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి జిల్లా వందశాతం ఫలితాలు సాధించే విధంగా పక్కా ప్రణాళికతో విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నారు.

ఆరు పేపర్లు, ఏడు పరీక్షలకు అనుగుణంగా...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు ఆరు పేపర్లుండగా ఏడు పరీక్షలు నిర్వహించేందుకు వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సామాన్యశాస్త్రం, గణితం, సాంఘీక శాస్త్రం 6 సబ్జెక్టులకు ఆరు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు సామాన్య శాస్త్రంను భౌతికరసాయనశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లుగా విభజించి పరీక్ష నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో ఏడు పేపర్లకు అనుగుణంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, వాటికి వచ్చే మార్కుల ప్రకారం విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీంతో డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేయించిన విద్యాశాఖ జనవరి 2 నుంచి రెగ్యులర్ తరగతులలో సిలబస్ రివిజన్ చేయడంతో పాటు హెచ్‌ఎంలు ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 2 : ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఎవరైనా పరీక్ష ఫీజు చెల్లించనట్లయితే బుధవారం రూ.2500 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని గమనించి ఇంటర్ వార్షిక ఫీజు చెల్లించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయిని



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 2 : కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే నోట్‌బుక్స్ అందజేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసినందుకు ఎమ్మెల్యేకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇవి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెలాఖరులోగా రైస్ మిల్లర్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

హనుమకొండ రూరల్, జనవరి 2 : పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లుల యాజమాన్యం గడువులోగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధేశించిన గుడువులోగా రైస్ మిల్లర్లు బియ్యానికి సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌లో వచ్చిన ధాన్యం నుంచి రావాల్సిన బియ్యం పలు మిల్లుల నుంచి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, డీఎం మహేందర్, సివిల్ సప్లయీస్ డీటీలు రమేశ్, కృష్ణ, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 17 మందిని తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.తిరుమలదేవిలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరీక్షల కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ పాల్పడిన ఐదుగురిని, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని కళాశాలలో 8 మందిని, ఉమ్మడి ఖమ్మంలో జిల్లాల పరిధిలోని కళాశాలల్లో మరో 4 మంది డీబారైనట్లు తెలిపారు.

కేయూలో ఇద్దరికి బోధనేతర కారుణ్య ఉద్యోగాలు

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ విధుల్లో పని చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు బోధనేతర సిబ్బంది ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలలో భాగంగా ఇద్దరికీ ఉద్యోగాలు కల్పించారు. ఈ మేరకు మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్ష విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన నారగోని వెంకన్న కుమారుడు నారగోని శివాజీ గౌడ్‌కు క్లర్క్ కం టైపిస్టుగా, అలాగే సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పనిచేసిన బస్కుల పోచయ్య కుమారుడు బస్కుల సునిల్‌కు కామాటిగా వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్యోగ నియమాకాల పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు, వర్సిటీ ఉద్యోగులుపాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, జనవరి 2 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ మంగళవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. జీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబరు 31, జనవరి 1న రాత్రి హనుమకొండ పరిధిలోని కుమార్‌పల్లి, కేయూ జంక్షన్, అశోక జంక్షన్, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో సుమారు 75 మందిని మద్యం తాగినట్టు గుర్తించి మంగళవారం కోర్టుకు తరలించారు. వీరిలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నారాయణతండాకు చెందిన అజ్మీర ప్రకాశ్, వరంగల్ దేశాయిపేటకు చెందిన తమ్మిశెట్టి తిరుపతిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఇంకా 73 మందికి రూ. 1.22 లక్షల జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిని కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాచకొండ రమేష్ పరకాల జైలు అధికారులకు అప్పగించారు.

ఉపాధి శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మడికొండ, జనవరి 2: మడికొండ వ్యాసపురి కాలనీలోని వేదవ్యాస పబ్లిక్ స్కూల్ ఆవరణలో సేవా భారతి, గోద్రేజ్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మంగళవారం కౌశలం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వాహకులు రాసమల్ల మహేష్ తెలిపారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్ తదితర గృహోపకరణ వస్తువుల రిపేరులో శిక్షణ ఇచ్చి అనంతరం వారికి గోద్రేజ్, రిలయన్స్, ఐఎస్‌ఫ్బీ వంటి ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణలో ఆసక్తి గల నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 90599 07740 నెంబర్‌లో సంప్రదించాలని మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి,జెడ్‌పీటీసీ సరిత,సర్పంచ్ రాజిరెడ్డి,ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న డీటీయూ ఆవిర్భావ సభ

డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్



డీటీయూ ఆవిర్భావ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

వడ్డెపల్లి, జనవరి 2: మహనీయులు గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతి రావుపూలే, సావిత్రిబాయి పూలే, జాన్ డ్యూయి ఎడ్యుకేషనల్ ఫిలాసఫర్, బీఆర్. అంబేద్కర్ అందించినటువంటి జ్ఞాన వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి ఆలోచన విధానంలో పనిచే యడం కోసం ఈ నెల 7న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఎస్‌వీకే కన్వెన్షన్ హాల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల నాయక త్వంలో ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు డీటీయూ రాష్ట్ర నేత దామెర ఉపేందర్ తెలిపారు. మంగళవారం రాంనగర్‌లో నిర్వహించిన డీటీయూ ఆవిర్భావ సన్నాహక కమిటీ బాధ్యుల సమావేశంలో ఆవిర్భావ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 80 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. మహనీయుల ఆలోచనలతో ధర్మ టీచర్స్ యూనియన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపాధ్యాయులు సంఘటితం కావల్సిన సమయం ఆసన్న మైందని పేర్కొన్నారు. ఆవిర్భావ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. డీటీయూ ఆవిర్భావ బాధ్యులు సాంబయ్య, శ్యాంసుందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 2: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న గోవులను మంగళవారం సాయంత్రం డివిజన్ కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నిర్వాహకులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం వేములవాడ గోశాల నుంచి మండలంలోని జీకే తండాకు 20గోవులను తరలించేందుకు పర్మిట్ తీసుకుని దారిమళ్లించి హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో గోశాల నిర్వాహకులు పట్టణ శివారులో పట్టుకోవడం జరిగిందన్నారు. డీసీఎం నంబర్ టీఎస్ 30 టీఏ0850 లో తనిఖీ చేయగా 24గోవులు ఉన్నాయన్నారు. డీసీఎంలో ఉన్న ఎల్. భాస్కర్, ఎ. సంతోష్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే గేటు మూసివేత

కమలాపూర్, జనవరి 2 : హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య గల ఎల్కతుర్తి మండలంలోని బావుపేట రైల్వే గేటు (నెంబరు 9ఈ) ఈ నెల 4, 5వ తేదీ వరకు రెండు రోజుల పాటు గేటు మూసివేయనున్నట్లు కాజీపేట రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి జీపి.సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్-హనుమకొండ వెళ్లే మార్గం లోని ఏకైక గేటు కావడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు. కాగా హసన్‌పర్తి-ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య కొత్తగా వేసిన మూడో రైల్వే లైన్ ట్రాఫిక్, పవర్ బ్లాకింగ్ అనుసంధాన పనుల వల్ల సికింద్రాబాద్ నుంచి కాగజ్ నగర్ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 13వ తేదీ వరకు రద్దు చేయబడ్డాయని, కేవలం హైదరాబాద్-కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ట్రైన్ నెంబరు అప్ 17011, డౌన్ 17012 మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

రంగశాయిపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ముహూర్తం

శంభునిపేట, జనవరి 2: రంగశాయిపేటలో ఫిబ్రవరి 12 నుంచి 14వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్‌వైఎఫ్ బాధ్యులు తెలిపారు. రంగశాయిపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనకై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వెలిదె భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రీలు వివరాలను వెల్లడించారు. గతంలో మార్చి1న ముహూర్తం ఖరారు చేయగా, ఆ సమయంలో విద్యార్థులకు పరీక్షలు ఉన్నందున తేదీలను మార్పు చేశామన్నారు. ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేడల జనార్దన్, కొల్లూరి యోగానంద్, గుండు పూర్ణచందర్, మండల మొగిలి, పరశురాములు, గంధ్రాతి కుమార్, శేర్ల అనిల్ కుమార్, చందా మనోహర్, ముత్తినేని రామ్మూర్తి, శెంకేశి శ్రీనివాసమూర్తి, లింగమూర్తి, పెరుమాండ్ల రమేష్, పోతు రమేష్, విలాసాగరం విశ్వనాథం పాల్గొన్నారు.

4న అనఘాష్టమి వ్రతాలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 2: ఈనెల 4న ములుగురోడ్‌లోని శ్రీవరద దత్తక్షేత్రంలో వేయి జంటలతో సామూహిక ప్రధాన శ్రీఅనఘాష్టమి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎస్ దత్తజ్ఞాన బోధ సభ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. ప్రతీ ఏడాది మార్గశిర మహాళ అష్టమి రోజున ముఖ్యమైన పండగగా దత్తపీఠంలో ఆచరిస్తారని, నగరంలో కూడా 30 ఏళ్ల నుంచి ఈ వ్రతాలను ఆచరిస్తున్నట్లు తెలిపారు. అవధూత దత్తపీఠం ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ భక్తులందరితో వ్రతాలను ఆచరింపచేస్తారని తెలిపారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



రాంచంద్రాపురంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని

సంగెం, జనవరి 2: ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను భద్రపర్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మండల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారంరాంచంద్రాపురం, షాపూరం గ్రామాల్లో ప్రజాపాలన సభలను సందర్శించి ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను స్వీకరించే సమయంలో వారికి తగిన రశీదును అందజేయాలన్నారు. దరఖాస్తుల కొరతను సృష్టించవద్దన్నారు. ప్రజా సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. నిత్యం ప్రజలు అందించే దరఖాస్తులను రికార్డులో పూర్తి వివరాలతో నమోదు చేసి దరఖాస్తులను ట్రంకు పెట్టెల్లో భద్రపర్చాలని చెప్పారు. ప్రజలు అందించే దరఖాస్తులపై నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు బొంపెల్లి జయశ్రీదిలీప్‌రావు, సట్ల రాజు, ఎంపీటీసీ చిదురాల రజిత, ఎంపీవో కొమురయ్య, సివిల్ సప్లై డిటీ కిరణ్‌కుమార్, ఆర్‌ఐ బాలాజీ, ఏఎస్సై జయపాల్‌రావు, విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

- ఖిలావరంగల్: ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని 37వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయిని దూడయ్య అన్నారు. ఖిలావరంగల్ తూర్పుకోట పోచమ్మదేవాలయం వద్ద దరఖాస్తుల రెండో కౌంటర్‌ను గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెడిద వీరన్న, ఖిలావరంగల్ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బిక్క రాంబాబు, బంగారి శ్రీనివాస్, మాదాసి మధు, సిరబోయిన సుధాకర్, వేణు పాల్గొన్నారు. అలాగే, మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీ-శ్రీనివాస్ 34వ, డివిజన్ రామాలయం కమ్యూనిటీ భవనంలో దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయరాంచందర్, పట్టూరి సుధాకర్, వెంకట్, రాజు, శ్రీధర్, కిరణ్‌పాల్గొన్నారు.
- గీసుగొండ : తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించడం ఆనందంగా ఉందని ఉద్యమకారులు పేర్కొన్నారు. ధర్మారంలో అభయహస్తం ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యమకారులు మంగళవారం మాట్లాడారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోయామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులపై సానుకూలంగా వ్యవహరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంగుల రమేష్, గాదె బాబు, పోలెబోయిన ప్రభాకర్, గాదె రాజు, పోలెబోయిన కృష్ణ, రవి, కత్రోజు అజయ్, గాదె సందీప్, గోనె రాజు, పోలెబోయిన సాంబయ్య పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో 'బ్రహ్మకుమారి' స్వర్ణోత్సవాలు

ఖిలావరంగల్, జనవరి 2: ఈనెల 6,7 తేదీల్లో జరుగు బ్రహ్మకుమారి స్వర్ణోత్సవ వేడుకలను ప్రజాప్రతినిధులు, ప్రజలు విజయవంతం చేయాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వరంగల్ రీజనల్ డైరెక్టర్, వరంగల్ సబ్‌జోన్, సిస్టర్ సవిత అన్నారు. మంగళవారం బ్రహ్మకుమారి సంస్థ 50సంవత్స రాల సందర్భంగా శివనగర్‌లోని సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మం, శాంతి, సుఖం, జీవన విధానాన్ని నేర్పేదే బ్రహ్మకుమారి సంస్థ ఉద్దేశమన్నారు. సంస్థ 1973లో వరంగల్ జిల్లాతో పాటు నగరంలో ప్రారంభమైందన్నారు. వేడుకలకు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, యశ్వనిరెడ్డి, కేఆర్ నాగరాజు, కౌశిక్‌రెడ్డి, మురళీనాయక్, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 6, 7 తేదీల్లో హంటర్‌రోడ్‌లోని డీ కన్వెషన్ హాల్‌లో స్వర్ణోత్సవాలు జరుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుధాకర్, మనోహర్, శశిధర్ పాల్గొన్నారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి: కలెక్టర్



చాంబర్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్



కలెక్టర్‌కు బొకే అందిస్తున్న తహసీల్దార్స్ అసోసియేషన్



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న ట్రెసా ప్రతినిధులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 2: సరికొత్త ప్రణాళికలతో 2024లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలను కలెక్టరేట్ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు బొకే అందజేశారు. అధికారులు కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో కలెక్టర్ కేక్ కట్ చేశారు. అధికారులందరు కూడా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ నూతన ఉత్సాహంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. జిల్లాను రాష్ట్రంలో అగ్రభాగాన ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీవో వాసుచంద్ర, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, డీడబ్ల్యూవో శారద, డీపీఆర్‌వో ఆయుబ్ అలీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి కల్పన, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్‌కుమార్, కలెక్టరేట్ ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ విశ్వనారాయణ ఇతర సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

- వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ ఉద్యోగులు జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రావీణ్యను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఎన్జీవోస్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

  కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, ఆర్‌డీవో వాసుచంద్ర, ఏవో శ్రీకాంత్, హేమానాయక్, దుర్గారావు, చందర్, మధు, ఇంద్రసేనారెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- పోచమ్మమైదాన్ : కలెక్టర్ ప్రావీణ్యను మంగళవారం హన్మకొండలోని కార్యాలయంలో తహసీల్దార్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు వేర్వేరుగా కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ మహ్మద్ ఇక్బాల్, తహసీల్దార్లు బండి నాగేశ్వర్‌రావు, రాజేష్‌గౌడ్, శ్రీనివాస్, ఫణికుమార్, ట్రెసా ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ జి.రాజ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్, వరంగల్ ట్రెజరర్ జి.శ్రీనివాసరెడ్డి, ఎమ్డీ అబీబ్, శ్రీకాంత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రేవూరిని సన్మానిస్తున్న బాలిరెడ్డి, గ్రామస్థులు

గీసుగొండ, జనవరి 2: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే, ప్రొటెం స్పీకర్ రేవూరి ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జాతీయ ఆదర్శ గ్రామం మరియపురం, కొమ్మాలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొన్నారు. మరియపురంలో ఎమ్మెల్యేను సర్పంచ్ బాలిరెడ్డి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత లబ్ధిదారులందరికీ రైతు భరోసా, ఇతర పెన్షన్లు యథావిధిగా అందిస్తామని, దీనిపై అపోహలు వద్దన్నారు. పథకాలు రాని అర్హులైన వారు అభయహస్తం కింద కొత్త దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవేందర్, ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు(ఆర్‌యూపీపీ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కొమ్మాలలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి చింతం నాగరాజు, అశోక్, రవిందర్, దామోదర్, కృష్ణమూర్తి, లలితారాణి, ధర్మన్న, నరసింహస్వామి, జ్యోతి, రవిందర్‌రెడ్డి , హెచ్‌ఎం మోహన్‌రావు, రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్‌రావు

'సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందంజ'

మట్టెవాడ, జనవరి 2: సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందంజలో ఉందని మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు అన్నారు. మంగళవారం పిన్నవారి వీధిలోని వాసవీ క్లబ్ వరంగల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా బెలిత వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పల్లెర్ల వీరన్న, కోశాధికారిగా గందె శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. వీరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వీరమల్లయ్య, రవ్వ గీత, రాజగోపాల్, పుల్లూరు కిశోర్, గుంటూరు వెంకటనారాయణ, నూతన్ కుమార్, పబ్బతి నాగభూషణం, తాళ్లపెల్లి వాసుదేవ్, వల్లాల పృథ్వీరాజ్, ఎలిశాల ఆనంద్‌కుమార్, జూలూరు కృష్ణమూర్తి, గుండా సంతోష్‌కుమార్, ఐత ప్రసాద్, శ్రీరాం భిక్షపతి పాల్గొన్నారు. కాగా, వాసవీ క్లబ్ బెస్ట్ రీజియన్ చైర్మన్ (2023)గా వల్లాల పృథ్వీరాజ్‌కు అవార్డు దక్కింది. ఈమేరకు పృథ్వీరాజ్‌ను క్లబ్ ప్రతినిదులు అభినందించారు.

'ఆర్యవైశ్య' క్యాలెండర్ ఆవిష్కరణ

మట్టెవాడ, జనవరి 2: ఆర్యవైశ్య వాసవీ మాత పరపతి సంఘం ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వ్యాపారవేత్త కాసం నమశ్శివాయ, వేణుగోపాల స్వామి దేవస్థానం అధ్యక్షుడు ఇరుకుల్ల రమేష్ అన్నారు. మంగళవారం వేణుగోపాలస్వామి దేవాలయంలో పరపతి సంఘం ఆధ్వర్యంలో న్యూఇయర్ క్యాలెండర్‌ను నమశ్శివాయ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు రూ.2లక్షల నిత్యావసర సరుకులు ఇటీవల అందించడం జరిగిందన్నారు. సంఘం సభ్యులకు రాజ్యలక్ష్మి గార్డెన్‌ను శుభకార్యాలకు ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆకినెపల్లి సత్యనారాయణ, రజినీ కాంత్, తోట నవీన్‌కుమార్, ఎలగందుల రమేష్, కొత్త వెంకటకృష్ణ, శ్రీనివాస్, రాజన్న, నాగరాజు, సర్వేశ్వర్‌రావు, ప్రవీణ్, పి.శ్రీనివాస్, మహేందర్, వెంకటనారాయణ, నాగరాజు, త్రిమూర్తి పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 2 : కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలని, జాప్యం జరిగితే సహించేది లేదని 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పనివారి సంఖ్య పెంచి త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 'కుడా' సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొండా దంపతులను కలిసిన నేతలు



కొండా దంపతులకు బొకే అందజేస్తున్న రమేష్‌బాబు

పోచమ్మమైదాన్, జనవరి 2: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును మంగళవారం మాజీ ఎమ్మెల్యే దొనెపూడి రమేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- గీసుగొండ: నూతన సంవత్సరం సందర్భంగా గీసుగొండ వైస్ ఎంపీపీ రడం శ్రావ్యభరత్‌ఆధ్వర్యంలోపలువురు మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీటీసీలు వీరారావు, భిక్షపతి, దండెం సుమన్, రౌతు యుగేందర్, గోదాసి చిన్న, వీరేశం, సింగిరి రాజుకుమార్, ఎలగొండ ప్రవీణ్, బోనాల అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, దర్శనాల రాజు, గాజర్ల రవి, పేర్ల శ్రావన్, విజయ్, రాజు ఉన్నారు.

ఎర్రబెల్లి స్వర్ణను కలిసిన ఫాస్టర్లు



వరంగల్‌టౌన్, జనవరి 2: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల, బాలాజీనగర్, ఎన్‌టీఆర్ నగర్, సుందరయ్య నగర్, ఎస్‌ఆర్ నగర్, ముసలమ్మకుంట, ఇందిరమ్మ కాలనీ ఫాస్టర్లు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్షుడు షాద్రాక్, ఉపాధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి దేవయ్య, జాయింట్ సెక్రటరీ కిరణ్, సహాయ కార్యదర్శి జోసఫ్, థామస్, అనిల్ మంగళవారం టీపీసీసీ కో ఆర్డినేటర్ అడువ మహేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను మర్యా దపూర్వకంగా కలిశారు.

'బైరి నరేష్‌పై దాడిని ఖండించాలి'

ఖిలావరంగల్, జనవరి 2: బైరి నరేష్‌పై దాడిని ఖండించాలని, రాజ్యాంగం ప్రకారం ఎవరైనా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చునని అంబేద్కర్ వాది మైదం సంజీవ అన్నారు. మంగళవారం ఖిలావరంగల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇటీవల ఏటూర్‌నాగారంలో నరేష్‌పై జరిగిన దాడికి వ్యతిరేకంగా వివిధ సంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఏటూర్‌నాగా రంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనపై అయ్యప్ప మాలధారుల దాడిని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుద్దాల నాగరాజు, మైదం రవి, బొళ్ల భిక్షపతి, తీగల జీవన్, ఇనుముల కృష్ణ, ఎడిది శ్రీనివాస్, నలిగంటి విజయ్‌పాల్, నలిగంటి విజయ్, ప్రేమ్‌సాగర్, కంజర్ల చేరాలు, నలి గంటి రాజు, మాదాసి రాజు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల్లో విషాదం

మారేడుమిల్లి విహారయాత్రకు బయలు దేరి మృత్యుఒడికి..

మానుకోటలో స్కూటర్ తప్పించబోయి, చెట్టు ఢీకొన్న కారు

ఇద్దరు వరంగల్ యువకులు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



రవితేజ (ఫైల్)



సాయిరాం (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : పాతచేదు జ్ఞాపకాలకు బై.. బై చెప్పి, అంతా శుభాలు జరగాలని ఆనందంగా ఉండే నూతన సంవత్సరాది ఆరంభం రోజున జరిగిన రోడ్డు ప్రమాద ఘటన రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వరంగల్ నుంచి మారేడిమిల్లి విహారయాత్రకు ఈనెల 1వ తేదీన కారు మహబూబాబాద్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం తప్పించబోయి, చెట్టుకొనడంతో.. ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.

వరంగల్ జిల్లా కేంద్రం మట్టెవాడ ప్రాంతానికి చెందిన యువకులు గుగ్గిళ్ల రవితేజ (29), వెంగళ సాయిరాం (27) సంగినేని సాయిరాం, పాకాల లక్ష్మణ్, సాయితేజ వరంగల్ నుంచి సోమవారం రాత్రి పొద్దుపోయాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా మారేడుమిల్లి విహారయాత్రకు రవితేజ కారులో బయలు దేరారు. మానుకోట జిల్లా కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డతండ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న గుగ్గిళ్ల రవితేజ, వెంగళ సాయిరాంలు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురు సంగినేని సాయిరాం, పాకాల లక్ష్మణ్, జి.సాయితేజకు తీవ్ర గాయాలుకాగా, అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం, వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవితేజ, సాయిరాం మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మంగళవారం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు మానుకోట టౌన్ సీఐ సతీష్ తెలిపారు.

ఆ రెండు కుటుంబాల్లో విషాదం..

తమకు అంతా మంచి జరగాలని ఏడాది పొడవునా సంతోషంగా ఉండాలని కుటుంబమంతా ఒకేచోట గడిపే నూతన సంవత్సరం ఆరంభం రోజున జరిగిన రోడ్డు ప్రమాదం ఆ రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. వరంగల్ జిల్లా కేంద్రంలోని మట్టెవాడకు చెందిన ఏఎస్సై గుగ్గిళ్లరామకృష్ణచారి-రవీంద్రమ్మ దంపతుల ఏకైక కుమారుడు రవితేజ (29), వెంగళ కుమారస్వామి- లలిత దంపతుల ఏకైక కుమారుడు సాయిరాం (27)లు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయా కుటుంబాల వారసులు మృత్యువాతపడడంతో ఆ రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మార్చిలో 3 రోజుల అంతర్జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో మార్చి 21, 22, 23 తేదీల్లో సోషియాలజీ, ఆంత్రోపాలజీ విభాగం నేతృత్వంలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ వెల్లడించారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఉద్యోగులతో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది వీసీ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. వీసీ మాట్లాడుతూ.. 2023లో కేయూ గొప్ప విజయాలను సాధించినట్లు పేర్కొన్నారు. న్యాక్ ఏ ప్లస్, స్నాతకోత్సవం, బయోటెక్నాలజీలో అంతర్జాతీయ సదస్సు, 82వ ఐహెచ్‌సీ సదస్సులను నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించినట్లు వివరించారు.

పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ సంయోజకులుగా వ్యవహరించగా వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ బన్న ఐలయ్య,ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, ఎం.తిరుమలదేవి, ప్రొఫెసర్ షమిత, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, చాడ రాధికారెడ్డి, ప్రొఫెసర్ సదానందం పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డీటీవో



కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న డీటీవో అఫ్రిన్‌సిద్ధిఖి

మట్టెవాడ, జనవరి 2: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను వరంగల్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ అఫ్రిన్‌సిద్దిఖి మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీటీవో అఫ్రిన్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ కోలా రవీందర్, వరంగల్ జిల్లా రవాణా శాఖ ఏవో నరేందర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీఎన్జీవోస్

మట్టెవాడ, జనవరి 2: తెలంగాణ రాష్ట్ర తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన వరంగల్ తహసీల్దార్ ఎండి ఎక్బాల్‌ను మంగళవారం వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎక్బాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు గద్దెల రాజు, నాయకులు శంకేసి రాజేష్, కుమార్, చిరంజీవి, గణేష్ పాల్గొన్నారు.

మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘం



డైరెక్టర్‌కు బొకే అందజేస్తున్న సంఘం నాయకులు

వరంగల్‌టౌన్, జనవరి2: రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె చాంబర్‌లో నూతన సంవత్సరం సందర్భంగా మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జన్ను భాస్కర్ అధ్యక్షతన మర్యాదపూర్వకంగా కలిసిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జమ్మికుంట సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జి.రెడ్డి నాయక్, కాటారం కార్యదర్శి ఎండి. లాషరీఫ్, పి.అశోక్, రాజేందర్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సఫ్దర్ హష్మీ

ఏకశిలానగర్, జనవరి 2 : మరణం లేని కళాకారుడిగా దివంగత సఫ్దర్ హష్మీ చరిత్రలో నిలిచారని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి వల్లందాసు దుర్గయ్య అన్నారు. హష్మీ 35వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో రామ సురేందర్ భవన్‌లో వర్ధంతి సభ నిర్వహించారు. హష్మీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సీహెచ్ రంగయ్య, పీఎన్‌ఎమ్ నాయకులు డి.రవి, రాజేష్ ఖన్నా, జీవన్ జానీ, మొగిలి, రాజు, ఎల్లస్వామి, శ్రీలత, సమ్మక్క, రజిత పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య



నరేష్(ఫైల్)

వరంగల్, జనవరి 2 : వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని కరీమాబాద్ వెళ్లే చిన్నబ్రిడ్జి వద్ద మంగళవారం పొక్కుల సతీష్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. ఉర్సు బొడ్రాయి ప్రాంతానికి చెందిన పొక్కుల సతీష్ భార్య రాజ్యలక్ష్మితో కలిసి మట్టెవాడ రాజీవ్‌కాలనీలో ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిసున్నట్లు సీఐ తెలిపారు. కొంతకాలంగా సతీష్ మతిస్థిమితానికి చికిత్స పొందుతుండగా, మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి సతీష్ మట్టెవాడ పోలీసుస్టేషన్‌కు వచ్చి భార్య, బామ్మర్దిలు తనను కొడుతున్నారంటూ ఫిర్యాదు చేయగా, భార్య రాజ్యలక్ష్మి, బామ్మర్దిని పిలిచి పోలీసులు విచారించారు. సతీష్ మానసికస్థితి సరిగా లేదని గుర్తించి వారిని ఇంటికి పంపించారు. సతీష్ రాత్రి ఇంటికి వెళ్లకుండా వరంగల్ రైల్వే గేటు సమీపంలోని చిన్నబ్రిడ్జి వద్ద మంగళవారం తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా సతీష్‌గా గుర్తించి ఎంజీఎం పోస్టుమార్టంకు తరలించి, అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



రాయపర్తిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయపర్తి, జనవరి 2 : మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న 20 మంది పారిశుధ్య కార్మికులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావుల అనిల్ కుమార్ మాట్లాడుతూ లయన్స్ 320 ఎఫ్ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు జన్మదినం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బుద్ద సునీల్ కుమార్, జోన్ చైర్‌పర్సన్ మందటి సుదర్శన్‌రెడ్డి, లింగమూర్తి, కృష్ణారెడ్డి, సర్పంచ్ గారె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నర్సంపేటలో క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 2 : నర్సంపేటలో బీఆర్ఎస్ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నల్లమనోహర్‌రెడ్డి, గుంటి కిషన్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి



రాకేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

పర్వతగిరి, జనవరి 2: జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ద్వితీయసంవత్సరం చదువుతున్న విద్యార్థి వి.రాకేష్ తొర్రూరులో జరిగిన పోటీల్లో పాల్గొని విజయవాడలో జరిగే సౌత్‌జోన్ నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈసందర్భంగా రాకేష్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెక్కొండ, జనవరి 2 : తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాల్గొన్న మండలంలోని సూరుపల్లి హై స్కూల్ విద్యార్థి చల్లా యశ్వంత్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెడ్మాస్టర్ బత్తుల పరమేశ్వర్ మంగళవారం తెలిపారు. గత నెల 29న నర్సంపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టు పోటీలో యశ్వంత్ తృతీయ స్థానం పొందాడన్నారు. విద్యార్థి యశ్వంత్, శిక్షణ ఇచ్చిన రసాయనశాస్త్రం ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను ఎంఈవో రత్నమాల, సర్పంచ్ సింగారపు గీతాభాస్కర్, ఎంపీటీసీ మాదాసు శారదశ్రీనివాస్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని



బాస్కూరి సిరి

వర్ధన్నపేట రూరల్, జనవరి 2 : మండలంలోని ఉప్పరపెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాస్కూరి సిరి రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభను చాటింది. కరీంనగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఎస్‌జీఎఫ్‌సీ అండర్ - 17, 63 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం వేణు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఉషారాణి, శ్రీదేవి, రాజు, లింగమూర్తి, పీఈటీ వీరస్వామి, అరుణదేవి తదితరులు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపేట, జనవరి 2: మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామానికి చెందిన బాషబోయిన ఉపేందర్ మంగళవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, జినుకుల కనుకమల్లు, ఎంపీటీసీ రమబాయి, షైబు సింగ్, రూపిక శ్రవణ్, ఈశ్వర్, బిక్షపతి, రమేష్, నర్సునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అపోహలొద్దు

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నర్సంపేట మండలం మగ్దుంపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, జనవరి 2 : రైతు భరోసా, పింఛన్లపై అపోహలొద్దని, పాత లబ్ధిదారులందరికీ యథాతథంగా కొనసాగుతాయని, కొత్తవారు ఎవరైనా లబ్ధి పొందాలనుకునేవారే దరఖాస్తు చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలం మగ్దుంపురం, దాసరిపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికే ప్రజాపాలన గ్రామసభలను నిర్వహిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైనన్ని దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సునీల్‌కుమార్ రాజ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు తమ ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సారధి టీం లీడర్ నెల్లుట్ల సుమన్, తాళ్ల సునిల్, యోచన, గాదెపాక బాబు, పడిదం రాజేందర్, బరిగెల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : అర్హులందరికీ ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని తొగర్రాయి, మల్లంపల్లి, పొనకల్, దుగ్గొండి గ్రామాలలో మంగళవారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, సర్పంచ్‌లు ఓడేటి తిరుపతిరెడ్డి, స్వామి, ఊర్మిళ, అధికారులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని రాబోయే పరీక్షలలో ప్రతిభ చాటాలని దొంతి మాధవరెడ్డి విద్యార్థులకు సూచించారు. మండలంలోని మల్లంపల్లి హైస్కూల్‌లో రోటరీ క్లబ్ వరంగల్ వారు పదో తరగతి విద్యార్థులకు మూల్యాంకన పుస్తకాలను మంగళవారం అందించగా ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ చుక్క రమేశ్, హెచ్‌ఎం భద్రమ్మ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మామిడాల రమేశ్‌బాబు, ఎల్లంకి రాజయ్య కురువల్లా రాజగోపాల్, పరుపాటి సుధాకర్‌రెడ్డి, ఆనంతుల కుమారస్వామి, ఉపాధ్యాయులు స్వప్న, దేవేందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనా... కాంగ్రెస్ పాలనా..!

అధికారిక కార్యక్రమ వేదికపై నాయకులు
చెన్నారంలో ప్రోటోకాల్ ఉల్లంఘన



చెన్నారంలో జరిగిన ప్రజాపాలన సమావేశంలో వేదిక పై కూర్చున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట రూరల్, జనవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం కాంగ్రెస్ పాలనలా మారిపోయిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అధికారిక కార్యక్రమాల వేదికలపై కాంగ్రెస్ నాయకులు కూర్చోవడంపై మండిపడుతున్నారు. ఇలాంటి ఘటనే చెన్నారంలో మంగళవారం చోటు చేసుకుంది.

చెన్నారంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రజాపాలనపై అవగాహన కల్పించే అధికారులను వెనక్కి నెట్టేసి కాంగ్రెస్ నాయకులు వేదికపై కూర్చోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, వర్ధన్నపేట బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డిలతోపాటు ఐనవోలు, వర్ధన్నపేట మండలాల నాయకులు వేదికపై కూర్చున్నారు. దీంతో మండల ఎంపీడీవో రాజ్యలక్ష్మి వారి వెనకాల కూర్చుని ఉండడం వివాదానికి దారి తీస్తోంది. ఎమ్మెల్యే అనుచరులు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

● సౌకర్యాల లేమితో అవస్థలు..

ప్రజాపాలన సమావేశాల్లో సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. చెన్నారం గ్రామంలో ఎమ్మెల్యే వస్తున్నాడనే సమాచారంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ సమావేశానికి వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదు. సరిపడా కుర్చీలు, మంచినీరు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సమావేశంలోనే ఉన్నామని ఎండలో ఉన్న వారికి నీటిని అందించలేదని వారు ఆరోపించారు. సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే నేరుగా జనాలను కలవకుండా మధ్యాహ్న భోజనం గ్రామంలో చేసి అనంతరం సమావేశానికి వచ్చాడని చెపుతున్నారు. దీంతో ప్రతిపక్ష పార్టీలు ఎమ్మెల్యే తీరుపట్ల విమర్శలు చేస్తున్నారు.

కొట్టుకున్న కేసులో..
ఇరువర్గాలపై కేసు నమోదు

చెన్నారావుపేట, జనవరి 2: పాత కక్ష్యలను దృష్టిలో పెట్టుకుని పరస్పరం కొట్టుకున్న కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనువాస్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం డిసెంబరు 31 రాత్రి మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన పులి రమేష్, అతని కుటుంబ సభ్యులు ఒక వర్గంగా, గట్టు విష్ణు, బండారి నవీన్‌లతో పాటు వారి మిత్రులు కలిసి మరో వర్గంగా ఏర్పడి తగాదపడి కొట్టుకున్నారు. దీంతో పులి రమేష్, గట్టు విష్ణు, బండారి నవీన్‌లకు గాయాలయ్యాయి. పులి రమేష్, గట్టు విష్ణు తండ్రి శ్రీనువాస్‌ల ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

రాయపర్తి, జనవరి 2 : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి దుక్కిటెద్దు మృతిచెందిన ఘటన మండలంలోని జయరాం తండాలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు లావుడ్యా మామ్‌జా తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ పనుల నిమిత్తం తన ఎద్దును మేతకు తీసుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి షాక్‌కు గురై ఎద్దు అక్కడికక్కడే మృతిచెందిదన్నాడు. దీంతో తనకు రూ. 55 వేల నష్టం జరిగినట్లు రైతు తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్ వైరు ప్రమాదకరంగా ఉండడంతో ఈ ఘటన జరిగిందని అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు
ఆస్పత్రికి తరలించిన 108 సిబ్బంది

చెన్నారావుపేట, జనవరి 2: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జల్లి గ్రామానికి చెందిన నూనె రాకేష్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై నెక్కొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే జల్లి శివారు దాటగానే రాకేష్ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయాడు. ఈ క్రమంలో నెక్కొండ నుంచి వస్తున్న 108 వాహనం డ్రైవర్ రాజారాం, టెక్నీషన్ రాజుకుమార్‌లు రోడ్డుపై పడి ఉన్న రాకేశ్‌ను గమనించి 108 వాహనంలో నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. 108 వాహనం సిబ్బంది చేసిన సేవలను రాకేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

దొరికిన బ్యాగును అప్పగించిన యువకులు



బ్యాగును అప్పగిస్తున్న ఎస్సై శ్రీనువాస్, యువకులు

చెన్నారావుపేట, జనవరి 2: తమకు దొరికిన బ్యాగును యువకులు ఆ బ్యాగు పోగొట్టుకున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి నిజాయతీగా తిరిగి అప్పగించి ఘటన మండలంలోని పాపయ్యపేటలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై శ్రీనువాస్ తెలిపిన వివరాల ప్రకారం పెద్ద వంగర మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జిలకర యాకాంబ్రం తన బ్యాగును మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామ శివారులో పోగొట్టుకున్నాడు. అదే దారిలో వెళ్తున్న పాపయ్యపేట గ్రామానికి చెందిన యువకులు బాలకృష్ణ, విజయ్, వెంకన్నలు గమనించి బ్యాగును తీసుకవచ్చి చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. వెంటనే ఎస్సై పస్తం శ్రీనువాస్ బ్యాగులో ఉన్న సర్వీస్ బుక్ బ్యాంకు పాస్ బుక్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, నగదు రూ 19వేలను గుర్తించి, బ్యాగులో ఉన్న వివరాల ఆధారంగా బాధితుడికి సమాచారం అందించి, పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బ్యాగును అప్పగించారు. బ్యాగును అందజేయడంలో నిజాయితీ చాటుకున్న యువకులను ఎస్సై శ్రీనువాస్ అభినందించారు.

మార్చిలో 3 రోజుల అంతర్జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, జనవరి 2 : కాకతీయ యూనివర్సిటీలో మార్చి 21, 22, 23 తేదీల్లో సోషియాలజీ, ఆంత్రోపాలజీ విభాగం నేతృత్వం లో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని కేయూ వీసీ ప్రొ ఫెసర్ తాటికొండ రమేశ్ వెల్లడించారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో ఉద్యోగులతో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది వీసీ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులకు పుష్పగుచ్ఛం అం దచేసి శుభాకాంక్షలు తెలిపారు. వీసీ మాట్లాడుతూ.. 2023లో కేయూ గొప్ప విజయాలను సాధించినట్లు పేర్కొన్నారు. న్యాక్ ఏ ప్లస్, స్నాతకోత్సవం, బయోటెక్నాలజీలో అంతర్జాతీయ సదస్సు, 82వ ఐహెచ్‌సీ సదస్సులను నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించినట్లు వివరించారు. పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ సంయోజకులుగా వ్యవహరించగా వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వల్లూరి రామచం ద్రం, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ బన్న ఐలయ్య,ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, ఎం.తిరుమలదేవి, ప్రొఫెసర్ షమిత, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, చాడ రాధికారెడ్డి, ప్రొఫెసర్ సదానందం పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు వితరణ



ఇల్లందలో రాములవారి అక్షంతలు వితరణ చేస్తున్న దృశ్యం

వర్ధన్నపేట రూరల్, జనవరి 2 : మండలంలోని ఇల్లందలో మంగళవారం ఇంటింటికి అయోధ్య రాముల వారి అక్షింతలను వితరణ చేశారు. రామమందిర్ తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు ఆలయానికి అక్షింతలను తీసుకురాగా, గ్రా మంలోని పలువురు భక్తిశ్రద్ధతలో ప్రతీ ఇంటికి అక్షింతలను అందించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు తక్కళపెల్లి శ్రీదేవి మాట్లాడుతూ అయోధ్యలో ప్రారంభానికి సిద్ధమైన శ్రీరాముని ఆలయాన్ని ప్రతీ ఒక్కరు తిలకించాలన్నారు. కార్యక్రమంలో అంబటి శారద తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం: అయోధ్య రాముడి అక్షింతలు ధర్మరావుపేట శివరామక్షేత్రానికి మంగళవారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించిన అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్‌రావు, ఎంపీటీసీ భల్గూరి విజాకర్‌రావు, నడిపెల్లి రాజేశ్వర్‌రావు, లింగబత్తుల యాకసాయన్న, అటికె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : అయోధ్య రామ జన్మభూమి తీర్థ కలషాలతో, పూజాధికారులు చేసిన అక్షింతలు మండలంలోని అమీనాబాద్‌కు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని సీతా రామంజనేయ స్వామి దేవాలయంలో ఉన్న అక్షింతలను సర్పంచ్ సిద్దెన రమేష్ గ్రామంలోని భజనలు. డప్పు చప్పుల మధ్య హనుమాన్ ఆలయంనకు తరలించారు. ఈ కార్యక్రమంలో బండి హరీష్, శ్రీరామ నవమి కమిటీ సభ్యులు కదారి సాయిలు, కదారి బీరయ్య, వీరభద్రయ్య, ఉరుగొండ కుమారస్వామి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి : శ్రీ అయోధ్య రామయ్య పరమ పవిత్ర అక్షింతల పంపిణీ కార్యక్రమం మండలంలోని దస్తగిరిపల్లిలో అత్యంత వైభవంగా ప్రారంభించడం జరిగిందని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మండల బాధ్యులు మార్త మార్కండేయ అన్నారు. మండలంలో ప్రతి ఇంటింటికి ఈనెల 15 వరకు అక్షింతల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కృష్ణస్వామి, పుట్టపాక రవి, గందె శ్రీనివాస్ గుప్తా, తడుక అశోక్, సుధగాని ప్రమోద్, తడుక వినయ్, పెండ్యాల రాజు, దేవేందర్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి



ఖానాపురం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పద్మజ

ఖానాపురం, జనవరి 2: పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు సకాలంలో వేయాలని జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రోగాం అధికారి డాక్టర్ పద్మజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోదక కార్యక్రమాలను వంద శాతం పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, వైద్యాధికారులు జ్యోతి, రాకేష్, సునిత, సిబ్బంది దేవిక, రామలింగయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : ఆశకార్యకర్తలు సమర్థవంతంగా పని చేయాలని పీవో ఎంహెచ్‌ఎన్ డాక్టర్ పద్మజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరోజ, స్టాఫ్ నర్సు స్వరూప, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వారిపై
చర్యలు తీసుకోవాలి

నెక్కొండ, జనవరి 2 : నెక్కొండలోని ఎస్సీ హాస్టల్ ప్రహరీని కూల్చి చల్లా గోదాముల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కన్వీనర్ ఈదునూరి యాకయ్య, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ వెంకటేశ్వర్లు తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఎస్సీ హాస్టల్ భవనం చుట్టూ నిర్మాణం చేసిన ప్రహరీ గోడను జేసీబీతో చల్లా గోదాముల యజమాని శ్రీనివాసరెడ్డి దౌర్జన్యంగా కూల్చి వేయించారని వారు ఆరోపించారు. ఇట్టి స్థలంలో ఉన్న చెట్లను సైతం తొలగించి అక్రమ నిర్మాణాలను చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు ఈ విషయమై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దండోరా జిల్లా ఉపాధ్యక్షుడు జంజల యాకయ్య, నాయకులు కందిక వెంకటయ్య, ఈదునూరి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజా పాలన గ్రామ సభలు



వర్ధన్నపేటలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న వరంగల్ రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్

వర్ధన్నపేట, జనవరి 2 : ప్రజాపాలన కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని వరంగల్ రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్ తెలిపారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని పురపాలక 7, 8 వార్డులలో జరుగుతున్న ప్రజాపాలన కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తును తప్పులు లేకుండా పూరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ అంగోతు అరుణ, మునిసిపల్ కమిషనర్ ఇ.జోనా, వార్డు కౌన్సిలర్ పాలకుర్తి సుజాత, మండల విద్యాశాఖ అధికారి రంగయ్య, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

●చెన్నారావుపేట: మండలంలోని ధర్మతండా, జల్లి, కందికద్దతండా, అమృతండా గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభలు కొనసాగాయి. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ మాట్లాడుతూ అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ ఈనెల 6 వరకు కొనసాగుతుందని అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తులను అందిచాలనారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీవో శ్రీధర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం : మండలంలో ప్రజాపాలన గ్రామ సభలు కొనసాగుతున్నాయి. మంగళవారం మనుబోతులగడ్డ, రంగాపురం, కొత్తూరు, రాగంపేట గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సోమయ్య, బూస రమఅశోక్, కందిక నరేష్, బాషబోయిన ఐలయ్యల అధ్యక్షతన నిర్వహించారు. మనుబోతులగడ్డలో ఆర్డీవో కృష్ణవేణి, కొత్తూరు, రాగంపేట, రంగాపురంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో సుమనవాణి తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు గాను మంగళవారం మండలంలోని చెరువుముందుతండా, రామన్నకుంట, చిన్నకొర్పోలు, వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సభల్లో లబ్ధిదారుల నుంచి 1817 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీంలీడర్లు ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏవో నాగరాజు, ఎంపీవో పర్వీన్, ఎంపీడీవో సూపరింటెండెంట్ జానకిదేవి, ఆర్ఐ నరేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాలాజీనాయక్, వెంకట్‌రెడ్డి, గుగులోతు రవి, గాడుదుల కుమార్ , కార్యదర్శులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలో మంగళవారం తెలంగాణ సాంస్కృతి కళాకారులు ప్రజా పాలన పథకాలపై పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. కళాకారులు నెల్లుట్ల సుమన్, తాళ్ల సుమన్, యోచన, పాల్గొన్నారు.